సాక్షి
అనకాపల్లి
బుధవారం । 18 । జనవరి । 2023


చల్ చల్ గుర్రం.. 8లో
- దౌడుకు సిద్ధమైన రేసు గుర్రాలు
- సంక్రాంతి తీర్థాల్లో మొదలైన పోటీ


ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయాలి
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు 8లో


పరీక్ష కేంద్రాల ఏర్పాటుపై ఆరా
అచ్యుతాపురం: ఈ నెల 22న పోలీస్ శాఖకు చెందిన పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ప్రశాంతి, కైట్స్ విద్యా సంస్థల్ని ఏఎస్పీ బి. విజయ్ కుమార్ మంగళవారం పరిశీలించారు.

న్యూస్‌రీల్

ఆర్చరీ రికర్వ్ పోటీల్లో ఎ.కోడూరు విద్యార్థి ప్రతిభ

అండర్-9 విభాగంలో కాంస్య పతకం సాధించిన సుదేవ్


పతకాలతో సాత్విక్ సుదేవ్

కె.కోటపాడు: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఆర్చరీ రికర్వ్ పోటీల్లో అండర్-9 విభాగంలో ఎ.కోడూరు గ్రామానికి చెందిన లెక్కల సాత్విక్ సుదేవ్ ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించాడు. విజయవాడలో సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో ఎన్‌టీపీసీ, ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, వోల్గా ఆర్చరీ అకాడమీ సంయుక్తంగా ఈనెల 13,14,15 తేదీల్లో ఈ పోటీలను నిర్వహించాయి. సాత్విక్ సుదేవ్ ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని తమిళనాడు బాలుర జట్టుపై విజయం సాధించి కాంస్య పతకాన్ని సాధించాడు. ఇదే పోటీల్లో మిక్స్‌డ్(బాలురు, బాలికలు) విభాగంలో సాత్విక్ సుదేవ్ రజిత పతకాన్ని సాధించాడు.

మలేరియా నియంత్రణకు చర్యలు

జిల్లా మలేరియా నివారణాధికారి వరహాలు దొర



రోలుగుంట: మలేరియా నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని, గ్రామస్థాయి నుంచి సర్వే చేసి, మలేరియా కేసులు గుర్తించి సత్వర వైద్యసేవలు అందిస్తున్నామని జిల్లా మలేరియా నివారణాధికారి కె.వరాహాలుదొర తెలిపారు. మండలంలో రాజన్నపేట గ్రామాన్ని మంగళవారం సందర్శించిన ఆయన స్థానిక ఆశ వర్కర్లు,ఏఎన్ఎంలతో మాట్లాడి మలేరియా జ్వరాల పరిస్థితులపై ఆరా తీశారు. డ్రైడేను పకడ్బందీగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కొత్తకోట, కింతలి,మరో గ్రామంతో కలపి మూడు గ్రామాల్లో 67 మలేరియా కేసులు నమోదయ్యాయన్నారు. రోగులకు అవసరమైన వైద్య సేవలను తమ సిబ్బంది అందిస్తున్నారని తెలిపారు. కేసులు నమోదైన ప్రాంతాల నుంచి రెండు కిలోమీటర్ల పరిధి వరకూ ఏసీఎం 5 శాతం మందును పిచికారీ చేస్తున్నట్టు చెప్పారు.

102 గ్రాముల బంగారం చోరీ

పాయకరావుపేట : పట్టణంలో కురుమళ్ల లేఅవుట్‌లోని అనూయ నూకరాజు ఇంట్లో 102 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు సీఐ అప్పలరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నూకరాజు కుటుంబ సభ్యులు సోమవారం బంధువుల ఇంటికి వెళ్లి మంగళవారం ఉదయం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. గదిలో గల బీరువాను పగుల గొట్టి, 102 గ్రాముల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్టు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. నర్సీపట్నం ఏఎస్పీ సత్యనారాయణ సంఘటన ప్రదేశాన్ని పరిశీలించినట్టు ఆయన చెప్పారు.

రూ.285 కోట్లతో ఉపాధి ప్రణాళిక

- మూడు నెలల పాటు గ్రామాల్లో సభలు
- తీర్మానాల ఆధారంగా యాక్షన్ ప్లాన్ రూపకల్పన
- 2023-2024 సంవత్సరానికి 1.11కోట్ల పని దినాలు లక్ష్యం


గ్రామసభలో సూచనలు చేస్తున్న డ్వామా ప్రాజెక్టు అధికారి సందీప్ (ఫైల్)


ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు

నాతవరం: ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పించాలన్న ధ్యేయంతో 2023–2024 సంవత్సరానికి సంబంధించి రూ.285 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో 24 మండలాల్లో 645 పంచాయతీల్లో ప్రస్తుతం 5,86,000 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో జిల్లా వ్యాప్తంగా ప్రతీ పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి, ఆ సభల్లో చేసిన తీర్మానాల ఆధారంగా 2023–24 ఏడాదికి సంబంధించి యాక్షన్ ప్లాన్‌ను ఈ నెల రెండో వారంలో సిద్ధం చేశారు. ఈఏడాది 3,75,000 మందికి మాత్రమే ఇంతవరకు పనులు కల్పించారు. వచ్చే ఏడాది జాబ్ కార్డు కలిగి ఉన్న వారందరికీ ఉపాధి హామీ పథకంలో పని కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ఈఏడాది 85 లక్షలకు పైగా పని దినాలు కల్పిస్తే వచ్చే ఏడాది 1.11 కోట్లకు పైగా పని దినాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

జిల్లాలో 633 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాల్లో షెడ్డుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం నిధులతో ఇంతవరకు 511 పంచాయతీల్లో షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయగా, 49 చోట్ల స్థలం సమస్య కారణంగా నేటికీ పనులు ప్రారంభించలేదు. మిగతావి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. జిల్లాలో అమృత్ సరోవర్ పథకంలో 104 చెరువులను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించగా ప్రస్తుతం 72 చెరువులను అభివృద్ధి చేశారు. వర్షాల కారణంగా మిగతా వాటిలో పనులు చేసేందుకు ఆటంకం ఏర్పడింది. వైఎస్సార్ జలకళ పథకంలో 742 బోర్లు మంజూరయ్యాయి. వీటిలో 292 బోర్లను ఉపాధి హామీ పథకంలో వేశారు. మిగతా వాటిని మార్చి నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈఏడాది ఉపాధి హామీ పథకంలో చేసిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.163 కోట్లు వేతనాల రూపంలో ఖర్చు చేయగా, మెటీరియల్ రూపంలో రూ.109 కోట్లు ఖర్చు చేసింది, వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో ఇంటిని నిర్మించుకునే లబ్ధిదారులకు పునాది తీసేందుకు మట్టి పనులకు ఉపాధి హామీ పథకం నిధులు చెల్లిస్తున్నారు. జిల్లాలోనే నాతవరం మండలంలోనే అధికంగా జాబ్‌కార్డులు కల్గిన వారు ఉన్నారు. దీంతో నాతవరం మండలంలోనే ప్రతి ఏటా ఉపాధి హామీ పథకంలో రోజుకు 12 వేల నుంచి 15వేల మంది కూలీలు పని చేస్తుంటారు.

అందరికీ పని

జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వ్యక్తికి ఉపాధి హామీ పథకంలో పని కల్పించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశాం.జాబ్‌కార్డుల కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం ఇస్తాం. వచ్చే ఏడాది 1.11 కోట్ల పని దినాలు కల్పించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేశాం. పని కల్పించడమే కాకుండా పలు అభివృద్ధి పనులు చేసేందుకు సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేశాం.

– ఎం.రోజారాణి, అడిషనల్ ప్రాజెక్టు అధికారి ఉపాధి హామీ పథకం

కనకమ్మ జాతర రేపు

ఉత్సవానికి భారీగా ఏర్పాట్లు


పాత జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ దీపాలంకరణ


కనకమహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహం


యలమంచిలి : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన స్థానిక ధర్మవరం వీధిలో వెలసియున్న కనకమహాలక్ష్మమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఈనెల 19న నిర్వహించనున్నారు. ఇందుకోసం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివస్తారు.ఏటా మార్గశిరమాసంలో నెలరోజుల పాటు ఇక్కడ అమ్మవారికి విశేష పూజలు జరుగుతాయి. అనంతరం తీర్థాన్ని స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో కనుల పండువగా నిర్వహిస్తారు. క్రీడా మైదానంలో రంగుల రాట్నాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ దుకాణాలు ఏర్పాటు చేస్తారు. కనకమహాలక్ష్మమ్మ అమ్మవారికి స్వర్గీయ కొఠారు రాంబాబు కుటుంబ సభ్యులు తొలి పూజా కార్యక్రమాలు చేసిన అనంతరం, భక్తులకు దర్శనం కల్పిస్తారు. నెల రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని, గురువారం భారీగా తీర్థం జరుగుతుందని ఉత్సవ కమిటీ చైర్మన్ కొఠారు సాంబశివరావు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు.యలమంచిలి సీఐ షేక్ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. యలమంచిలి పాత జాతీయ రహదారి నుంచి ధర్మవరం వీధుల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గఫూర్ హెచ్చరించారు

నేడు తులసీరావు సంస్మరణ సభ


తులసీరావు సంస్మరణ సభ నిర్వహించనున్న ప్రాంగణం


- 5 ఎకరాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు
- భారీగా హాజరుకానున్న రైతులు, ప్రజా ప్రతినిధులు
- 100 మంది పోలీసులతో బందోబస్తు

యలమంచిలి: దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు సంస్మరణ సభకు భారీగా ఏర్పాట్లు చేశారు. బుధవారం జరిగే ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో పాడి రైతులు,ప్రజాప్రతినిధులు, తులసీరావు అభిమానులు,పట్టణ ప్రజలు తరలిరానుండడంతో ఆ మేరకు సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. యలమంచిలి పట్టణంలో తులసీరావు స్వగృహం వద్ద ఐదు ఎకరాల ఖాళీ స్థలంలో సభ నిర్వహించనున్నారు. యలమంచిలి పట్టణంలో నలువైపుల నుంచి వచ్చే వాహనాలకు అంతరాయం కలగకుండా సీఐ షేక్ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో 100మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సంతాప సభకు అధికసంఖ్యలో అభిమానులు, రైతులు తరలివచ్చే అవకాశం ఉండడంతో పట్టణంలోకి భారీ వాహనాల ప్రవేశాన్ని నిషేధించి, ట్రాఫిక్‌ను హైవే మీదుగా మళ్లించారు. సభా ప్రాంగణం వద్దకు వేర్వేరు క్యూలైన్లలో పంపేలా ఏర్పాట్లు చేశారు. అన్ని గ్రామాల నుంచి పాడి రైతులు అధిక సంఖ్యలో తరలిరానున్నట్లు తులసీరావు కుమారుడు,కుమార్తె, విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి తెలిపారు. వంటకాలను తయారు చేయడానికి వివిధ ప్రాంతాల నుంచి సిబ్బందిని తీసుకొచ్చారు. భోజనాల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. సంస్మరణ సభకు వచ్చే మంత్రులు ఎమ్మెల్యేలు, వివిధ శాఖల,కార్పొరేషన్ల,జెడ్పీ చైర్మన్లు,జెడ్పీటీసీలు, ఎంపీపీలకు ప్రత్యేకంగా గ్యాలరీలు, కౌంటర్లు ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్ (చిన్నా),ఆడారి వెంకట్, మళ్ళ కొండ బాబు, ఆడారి పూరిజగన్నాథం, ఆడారి నాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.


మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్, రమాకుమారి

ఇక లంబసింగి.. లెక్క పక్కా..!

- త్వరలో ఆటోమెటిక్ రెయిన్ గేజ్ స్టేషన్
- వర్షపాతం, ఉష్ణోగ్రతల నమోదుకు వీలు
- ఇన్నాళ్లూ అంచనా వాతావరణ గణాంకాలే
- ఇకపై కచ్చితమైన సమాచారం
- ఏర్పాటుకు ఐఎండీ సన్నాహాలు


మంచుతో ఆహ్లాదకరంగా ఉండే లంబసింగి


ఏర్పాటు చేయనున్న ఆటోమేటిక్ రెయిన్ గేజ్ స్టేషన్

సాక్షి, విశాఖపట్నం: లంబసింగి.. ఈ పేరు వింటే అందరికీ గుర్తుకొచ్చేది అందమైన, ఎత్తయిన కొండ ప్రాంతం. రాష్ట్రంలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఓ కుగ్రామం. పర్వత శ్రేణుల్లో మంచు సోయగాలతో పర్యాటకులను అమితంగా ఆకర్షించే పర్యాటక ప్రదేశం. ఆంధ్రా కశ్మీరుగా ఖ్యాతి గడించింది. ×0₹ (సున్నా) డిగ్రీల కనిష్ట (రాత్రి) ఉష్ణోగ్రతల నమోదుతో తన ప్రత్యేకతను చాటుకుంటోంది. అందుకే శీతాకాలం వచ్చిందంటే చాలు.. లంబసింగికి టూరిస్టులు క్యూ కడతారు. దేశ, విదేశాల నుంచి వచ్చి వాలతారు. అక్కడ ప్రకృతి అందాలను తనివి తీరా ఆస్వాదిస్తారు. శీతాకాలంలో లంబసింగిలో ×జీరో₹ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందట! అంటూ జనం తరచూ విశేషంగా చర్చించుకుంటారు. కానీ ఆ లెక్క పక్కా కాదని ఎంతమందికి తెలుసు? అక్కడ ఉష్ణోగ్రతలను గాని, వర్షపాతాన్ని గాని నమోదు చేసే యంత్రాంగం లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలో లంబసింగి ఉంది. ఇక్కడికి 19.7 కిలోమీటర్ల దూరంలోని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్)లో నమోదయ్యే కనిష్ట ఉష్ణోగ్రతల కంటే లంబసింగిలో రెండు డిగ్రీలు తక్కువగా రికార్డయినట్టు చెబుతున్నారు. ఉదాహరణకు చింతపల్లిలో 2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైతే లంబసింగిలో '0' డిగ్రీలు రికార్డయినట్టు అంచనా వేస్తున్నారు. ఇన్నాళ్లూ దీనినే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో లంబసింగిలో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ (ఏడబ్ల్యూఎస్)ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాన్నాళ్లుగా ఉంది. దీనిని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఏర్పాటు చేయాల్సి ఉంది. గతంలో దీనిపై కొంత కసరత్తు జరిగినా ఆ తర్వాత మరుగున పడింది.

లంబసింగిలో ఏఆర్‌జీ..

తాజాగా భారత వాతావరణ విభాగం (ఐఎండీ) లంబసింగిలో ఆటోమేటిక్ రెయిన్ గేజ్ (ఏఆర్‌జీ) స్టేషన్‌ను మంజూరు చేసింది. లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సమీపంలో దీనిని ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ ఏఆర్‌జీ ఏర్పాటయితే ఆ ప్రాంతంలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలతో పాటు వర్షపాతం, గాలిలో తేమ శాతం రికార్డవుతాయి. దీని నిర్వహణను విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం (సీడబ్ల్యూసీ) చూస్తుంది. మరికొన్నాళ్లలో లంబసింగిలో ఏఆర్‌జీ సిస్టం అందుబాటులోకి వస్తుందని, అప్పటినుంచి అక్కడ కచ్చితమైన వాతావరణ సమాచారం రికార్డవుతుందని సీడబ్ల్యూసీ డైరెక్టర్ సునంద 'సాక్షి'కి చెప్పారు.

సముద్రమట్టానికి 3 వేల అడుగుల ఎత్తులో..

లంబసింగి తూర్పు కనుమల పర్వత శ్రేణుల్లో ఎత్తయిన ప్రదేశంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. చుట్టూ కాఫీ తోటలు, యూకలిప్టస్ చెట్లతో నిండి ఉంటుంది.

సముద్రమట్టానికి అరకు 2,700 అడుగులు, చింతపల్లి 2,800 అడుగుల ఎత్తులోనూ ఉంటే లంబసింగి 3,000 అడుగుల (వెయ్యి మీటర్ల) ఎత్తులో ఉంది. దీంతో లంబసింగి శీతాకాలంలో పొగమంచు దట్టంగా అలముకుని ఆహ్లాదం పంచుతుంది. మంచు ఐస్‌లా గడ్డ కట్టుకుపోతుంది. అంతేకాదు.. అత్యల్ప (0–3 డిగ్రీల) ఉష్ణోగ్రతలు నమోదవుతూ ప్రత్యేకతను చాటుకుంటోంది. లంబసింగి అందాలను చూడడానికి వచ్చే పర్యాటకుల కోసం పర్యాటకశాఖ గుడారాలను కూడా ఏర్పాటు చేసింది.

కొర్రబయలు నుంచి లంబసింగి..

లంబసింగికి కొర్రబయలు అనే పేరు కూడా ఉంది. కొర్ర అంటే కర్ర. బయలు అంటే బయట అని అర్థం. ఎవరైనా చలికాలంలో మంచు తీవ్రతకు ఇంటి బయట పడుకుంటే తెల్లారేసరికి కొయ్యలా బిగుసుకుపోతారని, అందుకే కొర్రబయలు పేరు వచ్చిందని చరిత్ర కారులు చెబుతారు.

చల్ చల్ గుర్రం..

- దౌడుకు సిద్ధమైన రేసు గుర్రాలు
- సంక్రాంతి తీర్థాల్లో మొదలైన పోటీ
- గుర్రాల పెంపకంపై యువకుల ఆసక్తి


గుర్రానికి శిక్షణ ఇస్తున్న రౌతు


గుర్రపు స్వారీపై శిక్షణ పొందుతున్న యువకులు

చోడవరం: ఒకప్పుడు టక్‌చిక్..టక్‌చిక్... గిట్టల శబ్దం వచ్చిందంటే రైలు బండి వేగాన్ని తలపించే గుర్రం జట్కా బళ్లు అందరికీ గుర్తొచ్చేవి. రవాణా సౌకర్యాలు లేని రోజుల్లో ఇవే ప్రధాన రవాణా వాహనంగా ఉండేవి. మారిన కాలంలో ఇవి కనుమరుగు య్యాయి. ఇప్పుడు మరలా చల్ చల్ గుర్రం...చలాకీ గుర్రం... అంటూ గుర్రాలు పరుగులు తీస్తున్నాయి. రాజుల కాలంలో ఓ వెలుగు వెలిగిన గుర్రపు స్వారీ, పరుగు పందేలు ఇప్పుడు గ్రామీణ తీర్థ మహోత్సవాల్లో పోటాపోటీగా నిర్వహిస్తున్నారు. కేవలం క్రీడా స్ఫూర్తితో నిర్వహించే గుర్రాల పరుగు పందేలను చూసేందుకు జనం కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. దాంతో కేవలం పందేల కోసమే కొంతమంది గుర్రాలను పెంచుతున్నారంటే అతిశయోక్తి కాదు. జైపూర్ మహారాణి పాలించిన మాడుగులలో దసరా రోజున ప్రత్యేకంగా గుర్రాల సంత నిర్వహించేవారు. కాలక్రమేణా దీనికి ఆదరణ తగ్గింది. మన్యం ప్రాంతాలకు వెళ్లేందుకు మైదాన గిరిజన గ్రామాలకు చెందిన వారు నేటికీ గుర్రాలనే రవాణాకు ఉపయోగిస్తున్నారు. దీనితో మైదాన గిరిజన గ్రామాల్లో వీటి పెంపకం పెరిగింది.

మూడు రకాలుగా గుర్రపు పందేలు

మొదటి రకం: పోటీకి వచ్చిన గుర్రాల సంఖ్యను బట్టి రెండు, మూడు గ్రూపులుగా విభజించి ఒకేసారి 5 నుంచి 7 గుర్రాలను పందెంలోకి దించి పరుగు స్వారీ చేస్తారు. వీటిలో ముందువచ్చిన గుర్రం విజేతగా నిలుస్తోంది. ఎక్కువ ఆట స్థలం ఉన్న చోట ఈ పందేలు నిర్వహిస్తారు.

- రెండో రకం: రెండేసి గుర్రాలను పోటీలోకి దించి గెలుపొందిన వాటికి మరలా పోటీ పెట్టి ఫైనల్‌లో విజేతను ప్రకటిస్తారు.
- మూడో రకం: ఒక్కొక్కటీ పోటీలో పెట్టి ఏ గుర్రం తక్కువ సమయంలో నిర్దేశించిన గమ్యాన్ని చేరుతుందో అది గెలిచినట్టుగా నిర్ణయిస్తారు. ఈ పందేలే ఇప్పుడు ఎక్కువగా గ్రామాల్లో జరుగుతున్నాయి. తీర్థాల్లో ఈ పోటీలను అందరూ చూడాలంటే గ్రామానికి సమీపంలోనే నిర్వహించాల్సి వస్తోంది. దీంతో టైమింగ్ పందేలే ఎక్కువగా జరుగుతున్నాయి.

మేలుజాతి గుర్రాలకే డిమాండ్

గుర్రాల సంతతి అంతరించిపోతున్నా మేలు జాతికి చెందిన గుర్రం రూ. లక్ష నుంచి రూ.4 లక్షల వరకూ అమ్ముడుపోతోంది. రాజస్థాన్, గుజరాత్, హైదరాబాద్, జైపూర్, కటక్ ప్రాంతాల నుంచి వీటిని కొనుగోలు చేసి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఇవి పోటీల్లో పరుగులు తీస్తుంటే ఆ ఆనందమే వేరు.

జిల్లాలో గుర్రాలు పోటీలు షురూ..

సంక్రాంతి తీర్థాలు, గ్రామదేవతల ఉత్సవాలను పురస్కరించుకుని గుర్రం పరుగుల పోటీలు ఇప్పటికే పలు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. ఈ నెల 19న జిల్లాలో అతి పెద్ద పండగైన చోడవరం మండలం రాయపురాజుపేట భూలోకమాత అమ్మవారి తీర్థ మహోత్సవం, బుచ్చెయ్యపేట మండలం రాజాం, ఆనందపురం గ్రామాల్లో పండగలు సందర్భంగా జిల్లా స్థాయి గుర్రాల పరుగుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ నెల 20న భోగాపురం, 26న శీమునాపల్లి గ్రామాల్లో జిల్లా స్థాయి గుర్రం పరుగు పందాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. వీటితోపాటు రావికమతం, మాడుగుల, అచ్యుతాపురం, పాయకరావుపేట, నర్సీపట్నం, కోటవురట్ల, రాంబిల్లితోపాటు రాజరిక కీర్తిని సంతరించుకున్న పద్మనాభం, ఎస్.కోట, భీమిలి, ఆనందపురం ప్రాంతాల్లో గుర్రపు పందేలు జోరుగా నిర్వహిస్తుంటారు.

పోటీలకు సిద్ధం



రెండేళ్లలో తూర్పుగోదావరి జిల్లా తుని, సామర్లకోటలో జరిగిన రాష్ట్ర స్థాయి గుర్రపు పరుగుల పోటీలో రుద్ర రైడర్ పేరుతో నా గుర్రాన్ని పోటీకి దించాను. ఈ పోటీల్లో మొత్తం 150 గుర్రాల వరకు వివిధ జిల్లాల నుంచి పాల్గొన్నాయి. అతి తక్కువ సమయంలో 3.11.6 నిమిషాల్లో 4 కిలో మీటర్ల మేర పరుగు పెట్టి నా గుర్రం ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రస్తుతం జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం చేశాను.

–దాడి కోటేశ్వరరావు, రౌతు, రాయపురాజుపేట

ఆ ఆనందమే వేరు..



గుర్రపు స్వారీలో ఉండే ఆనందమే వేరు. పోటీలో పాల్గొనే గుర్రాలకు మంచి దాణా పెట్టాలి. మేలు జాతి గుర్రాలైతే రూ.2, 3 లక్షలు వరకు ధర ఉంటుంది. నేను రూ.1.30 లక్షలు పెట్టి గుర్రాన్ని కొన్నాను. అనేక సార్లు పోటీల్లో పాల్గొని చాలా బహుమతులు గెలిచాను. పందేల్లో గుర్రంపై దౌడు తీస్తుంటే ఆ జోష్ చాలా బాగుంటుంది.

– రాజేష్, గుర్రం పెంపకందారుడు, గోపాలపట్నం

ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయాలి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం.బూడి ముత్యాలనాయుడు

తుమ్మపాల: సచివాలయ వ్యవస్థ అనేది సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అని, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువ చేయడం, సమస్యలు లేని విధంగా సేవలు అందించేందుకు సచివాలయ కన్వీనర్లకు పూర్తి బాధ్యత ఉంటుందన్నారు. ప్రభుత్వమిచ్చే ప్రతి సంక్షేమ పథకం సచివాలయ కన్వీనర్ల ద్వారా అందించాలన్నారు. మండలాలు, గ్రామాల వారీగా సచివాలయాల కన్వీనర్లతోపాటు, ప్రతి వలంటీర్ పరిధిలో గృహ సారధులను నియమిస్తున్నట్టు తెలిపారు. పూర్తి బాధ్యతతో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయకేతనం ఎగరేసే విధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుద కళ్యాణి, ఉత్తరాంధ్ర జేసీఎస్ సచివాలయ కన్వీనర్ల కోఆర్డినేటర్ హర్షవర్ధన్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నతీనార్లలో అతిసారం

- 20 మందికి వాంతులు, విరేచనాలు
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు
- పలువురికి నక్కపల్లిలో చికిత్స


అతిసార సోకిన వారికి చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

నక్కపల్లి: మండలంలోని మత్స్యకార గ్రామమైన చిన్న తీనార్లలో డయేరియా ప్రబలడంతో రెండు రోజుల నుంచి సుమారు 20 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. పండగ సందర్భంగా ఎక్కువగా మాంసాహారం తినడం వల్ల అతిసార సోకినట్టు వైద్య సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో సిరిపల్లి రాజమ్మ, చోడిపల్లి జగ్గన్న, గోసలా నాగమణి, చోడిపల్లి వెంకయ్యమ్మ, గారికిన సింహాచలం, గోవిందు, దూది కన్నయ్యమ్మ, దూది తనూజా, కంబాల నూకాలమ్మ, కంబాల కొందడు, తాతాజీ, చోడిపల్లి చిట్టి తదితర్లు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న వారిని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. గోడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి కిషోర్ ఆధ్వర్యంలో చిన్నతీనార్లలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి బాధితులకు వైద్య సేవలందిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. చేపలు, మాంసం తినవద్దని దండోరా వేయించారు. కాచి, చల్లార్చిన నీరు తాగాలని, భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది ప్రచారం చేస్తున్నారు. అతిసార పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుందని వైద్యాధికారులు తెలిపారు.

టేబుల్ టెన్నిస్ పోటీలకు 21లోగా నమోదు

తుమ్మపాల: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులో ఈ నెల 22న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ లీగ్ (ఫేస్–2) యు–13, యు–17, ఒపెన్ (బాయ్స్, బాలికలు) పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 21వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య క్రీడా శిక్షకులు ఎస్.సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్, వయసు ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 21 తేదీ ఉదయం 12 గంటల లోగా వాట్సాప్ నంబర్‌కు 9848293333కు పంపించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

ఎంట్రీ ఫీజు ఒక్కొక్కరూ రూ.300 చొప్పున గుంటూరు బీఆర్ స్టేడియంలో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు కోచ్ ఫోన్ నంబర్‌ను 8247635751ను సంప్రదించాలన్నారు.

కొట్లాట కేసులో ఆరుగురి అరెస్టు


జి.నగరంలో విచారణ చేస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

మాకవరపాలెం: కొట్లాట కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని జి.నగరంలో వాలీబాల్ ఆట సందర్భంగా రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాటకు సంబంధించి 20 మందిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కర్రలతో దాడికి దిగిన ఒక వర్గానికి చెందిన ఆరుగురిని మంగళవారం అరెస్టు చేశామని ఎస్‌ఐ తెలిపారు. నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్ కుమార్ గ్రామంలో విచారణ జరిపారు. మళ్లీ వివాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని గ్రామస్తులను ఆయన హెచ్చరించారు.

కడపాలెంలో జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలో పూడిమడక శివారు కడపాలెం సతకంపట్టు వద్ద జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. డాక్టర్ మేరుగు శంకర్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలతో పాటు, భగవద్గీత శ్లోక పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మేరుగు కాసులమ్మకు ప్రథమ స్థానం, కోడ గౌతమి ద్వితీయ స్థానం, ధోని పూజిత తృతీయ స్థానం, భగవద్గీత శ్లోక పోటీల్లో మైలపల్లి ప్రేరణకు ప్రథమ స్థానం, కాసారపు శైలజకు ద్వితీయ స్థానం, మల్లి అరుణ తృతీయ స్థానం పొందారు. వీరికి మేరుగు శంకర్, బాపయ్య, రాజారావు, ఏరిపల్లి బాపునాయుడు, రామారావు, చోడపల్లి కాసుబాబు తదితరుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

అపూర్వ కలయిక.. అద్వితీయ వేడుక


నల్లకొండమ్మ ఆలయం వద్ద 1996 పదో తరగతి బ్యాచ్


తాండవ రిజర్వాయరుపై 2003 పదో తరగతి బ్యాచ్

రాంబిల్లి: ఆనాటి హృదయాల ఆనందగీతం ఇదేలే అంటూ 20 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకుని సందడి చేశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి చిలిపి చేష్టలు, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మండలంలోని లాలంకోడూరు ఉన్నత పాఠశాలలో 2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఇదే బ్యాచ్‌కు చెందిన కశిరెడ్డి లక్ష్మణరావు ఎస్‌ఐ ఉద్యోగం సాధించడంతో అభినందించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. సహ విద్యార్థులను కష్ట పరిస్థితుల్లో ఆదుకునేందుకు సహాయపడాలని నిర్ణయించుకున్నారు.

మూడు ప్రాంతాల్లో సందడి..

నాతవరం: పూర్వ విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. మండలంలో డి.యర్రవరం హైస్కూల్‌కు చెందిన 1996 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం నల్లకొండమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో సమ్మేళనమయ్యారు. ఇదే హైస్కూల్‌కు చెందిన 2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తాండవ రిజర్వాయరుపై సమ్మేళనమయ్యారు. మదర్ విద్యా సంస్థలు కాలేజీకి చెందిన 2007 ఇంటర్మీడియట్ బ్యాచ్ విద్యార్థులు బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో కలుసుకున్నారు. వీరంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు.

ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తం చేసుకున్నారు. సంహపంక్తి భోజనాలు చేశారు. గంటల తరబడి పిచ్చాపాటి కబుర్లతో జీవిత విశేషాలు చెప్పుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. హైస్కూల్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించేందుకు తీర్మానించారు. కష్టాల్లో ఉన్న తోటి స్నేహితులకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు.

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీ విజేత ఎం.కొత్తపల్లి


జిల్లాస్థాయి పోటీల్లో పరుగు తీస్తున్న ఎడ్లబండి

చోడవరం: మండలంలోని ముద్దుర్తిలో సీతారాముల తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీల్లో నంబారు గాయత్రి (ఎం.కొత్తపల్లి) ఎడ్లు ప్రథమ బహుమతి రూ.12 వేలు గెలుచుకున్నాయి. తర్వాత వరుస స్థానాల్లో నిలిచిన ముమ్మున రామకృష్ణ (నర్సయ్యపేట) ఎడ్లు రూ.10 వేలు, మహాదేవ్ శ్యామ్‌కుమార్ (లక్ష్మీపురం) ఎడ్లు రూ.8 వేలు, నంబారు నాయుడు (ఎం.కొత్తపల్లి) ఎడ్లు రూ.6 వేలు, సిద్ధి వినాయక (మంగళాపురం) ఎడ్లు రూ.4 వేలు, పాచిలి నాగరాజు (ఎం.కోటపాడు) ఎడ్లు రూ.3 వేలు గెలుచుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫ్లోర్ లీడర్ పల్లా సంతోషి రమణ, స్కూల్ కమిటీ చైర్మన్ మలపురెడ్డి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ మలపురెడ్డి దేముడమ్మ, నాయకులు మోసూరు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బుద్ద గంగరాజు, బోడి సూరిబాబు, సచివాలయ కన్వీనర్ బోడి అప్పలస్వామినాయుడు, యాదవ సంక్షేమ సంఘం కన్వీనర్, మాజీ ఎంపీటీసీ మొల్లి ప్రసాద్, వెంకన్నపాలెం సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, పాల సంఘం అధ్యక్షుడు బుద్దల నాగరాజు, ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్ బోడి పైడిరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'రైతంటే' నాటిక ప్రదర్శన


నాటకరంగ దర్శకుడు ముసిలినాయుడును సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: గవర్ల అనకాపల్లిలో ఏర్పాటు చేసిన రైతంటే నాటిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నెహ్రూయూత్ క్లబ్ వార్షికోత్సవంలో భాగంగా నాటిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. మునగపాకకు చెందిన కళాకారులు ఈ ప్రదర్శన ఇచ్చారు. నాటికలోని నటీనటులు అద్భుతంగా నటించారు. నాటికకు దాడి ముసిలినాయుడు దర్శకత్వం వహించారు. కాగా దర్శకుడు ముసిలినాయుడును నెహ్రూ యూత్ క్లబ్ సభ్యులు ఆళ్ల మహేశ్వరరావు, శ్రీనివాసరావు, జోగినాయుడు, సరేంద్ర, వీరునాయుడు తదితరులు ఘనంగా సత్కరించారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేత టీమ్‌కు చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాజు

కోటవురట్ల : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాటానలపాలెంలో నిర్వహించిన ఆర్పీఎల్ క్రికెట్ టోర్నీ విశేషంగా ఆకట్టుకుంది. టోర్నీ ఆద్యంతం క్రీడాభిమానులను ఉర్రూతలూగించింది. గారా ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీ ఈ నెల 12న ప్రారంభం కాగా మంగళవారంతో ముగిసింది. తుది పోరులో సిరుకూరి స్టార్స్‌పై రావాడ రేంజర్స్ టీమ్ విజయం సాధించింది. విజేత టీమ్‌కు మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. విజేత టీమ్‌కు రూ.20 వేలు, రన్నర్స్‌కు రూ.10 వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకుడు గారా ఆనంద్, సర్పంచ్ బి.అనిల్‌కుమార్, ఆర్‌ఎస్.విజయ్, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మేలుకొలుపు భజన బృందానికి సత్కారం



మేలుకొలుపు భజన బృందాన్ని సత్కరిస్తున్న శ్రీకోదండరామ ఆలయ కమిటీ

తుమ్మపాల: గడిచిన ధనుర్మాస ఉత్సవాల్లో గవరపాలెం శ్రీకోదండరామ లక్ష్మి గణపతి ఆలయంలో మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించిన శ్రీచినరామ భజన బృందాన్ని ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కర్రి రమేష్, ధర్మకర్తల మండలి సభ్యుడు యల్లపు వెంకటరమణ మంగళవారం ఘనంగా సత్కంచారు. ఆలయంలో నెల రోజుల పాటు నిత్యం తెల్లవారు జామున నిష్ఠతో భజనలు చేసి పరమపవిత్రమైన సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి సన్యాసినాయుడు, కర్రి లక్ష్మణరావు, బుద్ధ మహలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

మంత్రి గుడివాడ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

కశింకోట : మండలంలోని అన్ని గ్రామాల్లో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదినోత్సవ వేడుకలను ఈ నెల 22న ఘనంగా నిర్వహించాలని మండల వైఎస్సార్ సీపీ సమావేశం నిర్ణయించింది. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన మంగళవారం కశింకోటలో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల వద్ద జన్మదిన వేడుకలు, మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ



పేదలకు వస్త్రాలు అందిస్తున్న నుదురుపాటి తాతాజీ

తుమ్మపాల: పట్టణంలో ప్రముఖ వ్యాపారి నుదురుపాటి తాతాజీ జన్మదినం సందర్భంగా చిన్నవీధిలో మంగళవారం నిరుపేదలకు నిత్యవసర సరకులు, చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఆయన వయస్సు ఆధారంగా ప్రతి ఏటా పెరుగుతున్న వయస్సు సంఖ్య ఆధారంగా అంతమందికి సేవలు అందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.శివ నారాయణ, తాటి కొండ శ్రీను, కె.వి.సత్యనారాయణ, పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 7,841 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,500	4,060
మొదటి రకం	2,980	3,410
రెండో రకం	2,820	3,070
మూడో రకం	2,800	2,940

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
వాల్తేరు వీరయ్య	- సత్యనారాయణ స్క్రీన్-1
వీర సింహారెడ్డి	- సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	- షిర్డిసాయి
వాల్తేరు వీరయ్య	- పర్తిసాయి
వీర సింహారెడ్డి	- వెంకటేశ్వర
లవ్ టుడే	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-3 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్, ఓ పాజిటివ్ 18 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 482 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 259 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర

- ఈ నెల 26 న జరిగే ఆందోళనను జయప్రదం చేయాలి
- రైతు సంఘాల అఖిలపక్ష సమావేశంలో నేతలు



రైతు సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

అనకాపల్లి రూరల్: దేశవ్యాప్తంగా అనేక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్న మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు కుట్ర చేస్తోందని రైతు సంఘాల అఖిల పక్ష నేతలు ఆరోపించారు. మంగళవారం అనకాపల్లి కార్మిక కర్షక నిలయంలో జరిగిన అఖిల పక్ష రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వం విధానాలపై చర్చించారు. పలువురు నేతలు కేంద్రం వైఖరిని ఖండించారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విద్యుత్ బిల్లు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, ఇలాంటి బిల్లులను ఆందోళనల ద్వారానే అడ్డుకోగలమని వారంతా అభిప్రాయపడ్డారు. రైతు చట్టాల రద్దు కోసం దేశవ్యాప్త ఆందోళనతో దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆ సమయంలో ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తీవ్ర జాప్యం చెస్తోందని ఆక్షేపించారు. మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాపోరాటాల ద్వారానే ఎదుర్కోవాలని అన్నారు.

ఇందుకోసం ఏఐకేఎస్ పిలుపు మేరకు ఈ నెల 26 న చేపట్టబోయే దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా అనకాపల్లిలో జరగనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం నేత ఎ.బాలకృష్ణ కోరారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం నాయకులు వై.ఎన్. భద్రం, కోరిబిల్లి శంకర్రావు, కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు, అఖిల భారత గ్రామీణ కార్మిక సంఘం ఆలిండియా నేత పి.ఎస్. అజయ్ కుమార్, కిసాన్ కాంగ్రెస్ నాయకుడు కాళ్ల ఏడుకొండలు, సీఐటీయూ నాయకుడు వివి శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్రావు, ఎం.నాగేశ్వర్రావు, బి నూక అప్పారావు పాల్గొన్నారు.

వేడుకగా పెద రామకోవెల తీర్థం



తీర్థంలో విన్యాసాలు తిలకిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని గవరపాలెం పెద రామకోవెల వద్ద మంగళవారం రాత్రి తీర్థ మహోత్సవం వేడుకగా జరిగింది. ప్రతి ఏటా సంక్రాంతి అనంతరం ఇక్కడ వైభవంగా తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్ సంప్రదాయ కోలాటం, భజనల్లో పాల్గొన్నారు. తప్పెటగుళ్ళు, కాగడా, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ తీర్థాలు మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. ప్రజల మధ్య ఐక్యతకు ఇలాంటి ఉత్సవాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. దాడి జగన్ ప్రభాకర్, కొణతాల సత్యనారాయణ, 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, 81వ వార్డు కార్పొరేటర్ ఇలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, మళ్ల రాజా, బొడ్డేడ శంకర్రావు, కొణతాల మురళీ కృష్ణ, కాండ్రేగుల కృష్ణ అప్పారావు, విల్లూరి రాము, శిలపరశెట్టి బాబి, మళ్ళ లక్ష్మీ ప్రసాద్, కర్రి శ్రీమన్నారాయణ, ఓమాల కాశీ పాల్గొన్నారు.

కన్నూరుపాలెంలో తీర్థం

కశింకోట : కన్నూరుపాలెం గ్రామంలో మంగళవారం సాయంత్రం తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆట వస్తువులు, తిను బండారాలు, పంచదార చిలుకలు, కర్జూరం, తదితర అమ్మకాలు జోరుగా సాగాయి. సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ శివ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అచ్చెర్లలో తీర్థ మహోత్సవం జరిగింది. సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పరవాడ పాలెంలోనూ తీర్థ మహోత్సవం భారీగా జరిగింది. కోడి పందాలు జరిగాయి.

అగ్నిప్రమాద బాధితుడికి సాయం

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో అగ్ని ప్రమాదంలో పాకను కోల్పోయిన బాధితుడిని మంగళవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పరామర్శించారు. గ్రామానికి చెందిన ఈర్ల నాగేశ్వరరావు పాక అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధితుడిని పరామర్శించారు. ఈ మేరకు బాధితుడికి రూ.5 వేలు నగదు, 25 కేజీల రేషన్ అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం కూడా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, ఈతకొట్టు నాగు, నవీన్, రాజు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలు పరిశీలించిన ఏఎస్పీ



పట్టణంలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న అడిషినల్ ఎస్పీ విజయభాస్కర్

తుమ్మపాల: ఈ నెల 22వ తేదీన జరగనున్న పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను అడిషినల్ ఎస్పీ బి.విజయభాస్కర్ మంగళవారం పరిశీలించారు. అనకాపల్లి పట్టణ పరిధిలో 11 పాఠశాలల్లో 12 పరీక్ష కేంద్రాల్లో పరిక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తరగతి గదులు, విద్యుత్, మంచినీరు వంటి మౌలిక సౌకర్యాలను పరిశీలిస్తున్నామన్నారు. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.సునీల్, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

చెరువుగట్టుపై పూరిళ్ల వాసుల సమస్య పరిష్కరిస్తా

- గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



ప్రజలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: మా కష్టాలు తెలుసుకుని పథకాలన్నీ నేరుగా మా ఇంటికే అందిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అర్హతను బట్టి మాకందరికీ పథకాలు మంజూరయ్యాయి. అని మహిళలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా చోడవరం సచివాలయం-3 పరిధి ఎడ్లవీధి, చినబజార్, రామకోవెల, చెరువుగట్టు ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎడ్లవీధి చెరువు గట్టుపై కొన్నేళ్లుగా పూరిళ్లలో నివసిస్తున్న లబ్ధిదారులంతా ఇంటి స్థలం పట్టాలు ఇప్పించాలని కోరారు. దీనిపై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ధర్మశ్రీ భరోసా ఇచ్చారు. వలంటీర్ల సేవలను స్థానికులు ప్రశంసించారు. 7వ వార్డులో పలు సమస్యలను విన్నవించగా, వాటిని పరిష్కరిస్తామని ధర్మశ్రీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఓటీఎస్ ఇంటి హక్కు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బండారు సత్యనారాయణ, ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలరావు, ఈవోపీఆర్డీ చైతన్య, పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ధ గంగరాజు, పంచాయతీ ఈవో నారాయణరావు, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, వార్డు మెంబరు ఓరుగంటి నాగమణి, ఎంపీటీసీ పాట్నూరి అరుణ, సచివాలయ కన్వీనర్ సిద్దాబత్తుల వాసు పాల్గొన్నారు.

నేడు అక్కిరెడ్డిపాలెంలో గడపగడపకు

తుమ్మపాల : అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం గ్రామంలో ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో నేడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం మొదలవుతుందని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును కలిసిన జేసీఎస్ మండల ఇన్‌చార్జులు



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును కలిసిన నాలుగు మండలాల ఇన్‌చార్జులు

దేవరాపల్లి: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల (జేసీఎస్)తో కలిసి మండల ఇన్‌చార్జులు సమష్టిగా కృషి చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచించారు. నియోజకవర్గంలో మాడుగుల మండలానికి బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, దేవరాపల్లి మండలానికి కొట్టాన వెంకటరమణ, కె.కోటపాడు మండలానికి ఏటుకూరి అప్పలరాజు, చీడికాడ మండలానికి ఈర్లె చైతన్య జేసీఎస్ ఇన్‌చార్జులుగా నియమితులయ్యారు. వీరు మంగళవారం తారువలో డిప్యూటీ సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధితోపాటు నిర్దేశించే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం పాల్గొన్నారు.

22న మేథ్స్ టాలెంట్ టెస్ట్

చోడవరం రూరల్: స్థానిక కందర్ప కాలనీ ఎంపీయూపీ పాఠశాలలో ఈ నెల 22న పదో తరగతి విద్యార్థులకు మేథ్స్ (గణితం) ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్టు డాక్టర్ త్యాగరాజు చెల్లూరి మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు ఏడ్వకేట్ చెల్లూరి కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిషు, తెలుగు మీడియాల్లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలతోపాటు జ్ఞాపికలు అందచేస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మాత్రమే ఉదయం 10 గంటల లోపు హాజరు కావాలని కోరారు.

తులసీరావు సంతాప సభకు తరలిరండి



మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్ర పాడి రైతుల పెన్నిధి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు సంతాప సభకు అన్ని గ్రామాల నాయకులు, రైతులు తరలిరావాలని డైరెక్టర్ గేదెల సత్యనారాయణ కోరారు. మంగళవారం కొమళ్లపూడి విశాఖ డెయిరీ బల్క్ కూలింగ్ కేంద్రం వద్ద రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల నాయకులు, రైతు సంఘ నాయకులు, డెయిరీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. బుధవారం యలమంచిలిలో తులసీరావు సంతాప సభకు వెళ్లేందుకు ప్రతి గ్రామంలో పాల కేంద్రం నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, కాపు సంఘం మండలాధ్యక్షుడు ముచ్చకర్ల అప్పారావు, సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటల పోటీలతో మరింత ఉత్సాహం

నాతవరం: గ్రామాల్లో ఆటలు పోటీలు నిర్వహించడం ఎంతో ఆనందాయకంగా ఉందని సర్పంచ్ పైల శిరీషా తెలిపారు. మంగళవారం సాయంత్రం చెర్లోపాలెంలో పలు ఆటలు పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల నిర్వహణతో అన్ని వర్గాల ప్రజల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. మాజీ సర్పంచ్ మాకిరెడ్డి వెంకటరమణ, నర్సీపట్నం యూనియన్ బ్యాంకు మేనేజరు పైల నాని, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శీతాకాలంలో ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి జాహ్నవి

కె.కోటపాడు: శీతాకాలంలో వృద్ధులు, చిన్నారు లు ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని లంక వానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా మంగళవారం గవరపాలెంలో ఆరోగ్య సేవలందించారు. ఓపీ ద్వారా 113 మందితోపాటు అచేతన స్థితిలో ఇంటి వద్ద ఉన్న 9 మందికి వైద్యం అందించడంతో పాటు ఉచితంగా మందులు ఇచ్చారు. వైద్యాధికారి తిలక్, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, రమణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



అల్లూరి పార్కులో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

గొలుగొండ: అల్లూరి పార్కులో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఏఎల్ పురం జిల్లా పరిషత్ హైస్కూలకు చెందిన 2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా 20 సంవత్సరాల తర్వాత కలుసుకుని ఆనాటి బాల్య స్మృతులు నెమరువేసుకున్నారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం చేయాలని నిర్ణయించుకున్నారు.

'తప్పుడు పత్రాలతో పరిహారం పొందారు'



కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న బాటజంగాల పాలెం గ్రామస్తులు

తుమ్మపాల: అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి విస్తరణలో వేటజంగాలపాలెం రామాలయం భూమి (గ్రామకంఠం)కి తప్పుడు పత్రాల సమర్పించి నష్టపరిహారం పొందిన తొమ్మిది మంది వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సబ్బవరం మండలం బాటజంగాలపాలెం సర్పంచ్ పి.వెంకటరమణ, ఉపసర్పంచ్ ఎస్కె మదీనా, గ్రామస్తులు కలెక్టరేట్ గేటు వద్ద మంగళవారం నిరసన తెలిపారు. సర్వే నెం.81లో గ్రామకంఠం భూమి పూర్వకాలంగా రామాలయం భూమిగా ఉంది. జాతీయ రహదారి విస్తరణలో కొంత భూమి పోగా మిగిలిన భూమి రామాలయం కింద ఉంది. రోడ్డు విస్తరణలో కోల్పోయిన కొంత భూమికి నష్టపరిహారం పొందడానికి గ్రామానికి చెందిన తొమ్మిది మంది తప్పుడు పత్రాలు సృష్టించి జాతీయ రహదారి విభాగం వారి నుంచి నష్టపరిహారంగా రూ.20 లక్షలు పొందారు. కొంత కాలంగా గ్రామసభలు పెట్టి ఆ నగదును రామాలయానికి చెల్లించాలని కోరుతున్నామని, వారు పట్టించుకోలేదని, ఈ మేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. తక్షణమే విచారణ చేపట్టి రామాలయానికి నగదు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మురుగు కాల్వ సమస్య పరిష్కరించండి



గవరపేట వీధిలో డ్రైనేజి సమస్యను తెలుసుకుంటున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు

అనకాపల్లి రూరల్: తుమ్మపాల గవరపేట వీధి కొణతాల వారి దిబ్బ వద్ద డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడును మంగళవారం కోరారు. ఇక్కడ చాలా కాలంగా ప్రధాన కాల్వలో పూడిక పేరుకుపోవడంతో మురుగు నీరు నిలిచిపోతోందని స్థానికులు సర్పంచ్ దృష్టికి తెచ్చారు. దీనివలన దోమల బెడద ఎక్కువైందని తెలిపారు. మురుగు కాల్వను ఆధునీకరించి కాల్వపై కాంక్రీటు పలకలు ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన సర్పంచ్ పెంటయ్యనాయుడు వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి ఎక్కువ నిధులు అవసరమౌతాయని, మంత్రి గుడివాడ అమర్, ఎంపి సత్యవతి,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్‌ల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరనున్నట్టు సర్పంచ్ వారికి తెలిపారు. ఎంపీటీసీలు పన్నీరు లక్ష్మి, వడ్డాది భారతి, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జ్యోతిబసుకు నివాళి



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

అనకాపల్లి రూరల్ : దివంగత పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు 13వ వర్ధంతి సందర్భంగా అనకాపల్లి సీపీఎం నేతలు మంగళవారం ఆయనకు నివాళులర్పించారు. స్థానిక దొడ్డి రామానాయుడు భవనంలో జరిగిన కార్యక్రమంలో జ్యోతిబసు చిత్ర పటానికి పూలు వేసి అంజలి ఘటించారు. 33 సంవత్సరాల సుదీర్ఘకాలం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఆయన ఎంతో ఆదర్శవంతమైన పాలన అందించారని నేతలు కొనియాడారు. మరణానంతరం కూడా ఆయన శరీరాన్ని కలకత్తా వైద్య కళాశాలకు దానమిచ్చి అందరికీ స్ఫూర్తిగా నిలిచారన గుర్తు చేశారు. అదే పంథాను తమ పార్టీ నేతలంతా అనుసరిస్తున్నారని విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కళాశాలకు గత 13 ఏళ్లుగా తమ పార్టీ నేతలు మరణానంతరం అవయవ దానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.వి. శ్రీనివాసరావు, కొలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకష్ణ, గంటా శ్రీరామ్, తేలయా బాబు, ఉమామహేశ్వర్రావు, నూక అప్పారావు, నాగేశ్వరరావు, ఈశ్వర్రావు, ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

తుమ్మపాల : అనకాపల్లి మండలం బవులువాడ ఆర్‌వీఎస్‌నగర్‌లో పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. రూరల్ ఎస్ఐ నర్సింహరావు అందించిన వివరాల మేరకు ఆర్‌వీఎస్‌నగర్ శివార్లలో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ.772 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అభివృద్ధి బాటలో చింతలూరు

మాడుగుల: చింతలూరు ప్రగతి పథంలో పయనిస్తోంది. సర్పంచ్ కాళింగ కళ్యాణరాజు కృషితో సకల సదుపాయాలు చేకూరుతున్నా యి. ఇక్కడ 1,500 మంది జనాభా ఉంది. రూ. 90 లక్షలతో ఇంటింటికీ కుళాయి పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రతి వీధికి సీసీరోడ్లు నిర్మించారు. పొలాలకు సాగునీటి ఇబ్బందులు లేకుండా రూ. 60 లక్షలతో చెరువును బాగు చేశారు. వీరనారాయణం మెయిన్ రోడ్డు నుంచి గ్రామానికి రూ.48 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు.

శిక్షణ కేంద్రం వద్ద చురుగ్గా ఏర్పాట్లు



నక్కపల్లి శిక్షణ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపిడీవో

నక్కపల్లి : క్లీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. మండల కేంద్రం నక్కపల్లిలో చెత్తనుంచి సంపదతయారీ కేంద్రం వద్ద త్వరలో ప్రారంభమయ్యే ఈ శిక్షణాతరగతులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపిడీవో సీతారామ రాజు, ఈవోపిఆర్‌డీ వెంకటనారాయణలు తెలిపారు.మంగళవారం శిక్షణ కోసం ఎంపిక చేసిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యుపిసి) వద్ద పునఃనిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈశిక్షణ కేంద్రం నర్సీపట్నం డివిజన్‌లో 8 మండలాలకు చెందిన కార్యర్సులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్వీపర్లకు క్లీన్ ఆంధ్రప్రదేశ్, జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంపై శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. గ్రామాల్లో తడి, పొడిచెత్త సేకరణ, వాటిని సంపద తయారీ కేంద్రాలకు తరలింపు, అక్కడ వేరు చేసే విధానం, వానపాములను ఉపయోగించి వర్మింకంపోస్టు తయారీ చేసే విధానంపై ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇక్కడ గతంలో నిర్మించిన షెడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో తిరిగి పునఃనిర్మించి శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. నర్సీపట్నం డీవిజన్‌కు సంబంధించి నక్కపల్లిలో పాయకరావుపేట, నాతవరం, ఎస్.రాయవరం, కోటవురట్ల, నక్కపల్లి, నర్సీపట్నం, రోలుగుంట, యలమంచలి మండలాలకు త్వరలో ఈ శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించే కార్యక్రమంలో భాగంగా రీసైక్లింగ్ చేసి రోడ్ల నిర్మాణంలో వాడే విధానంపై కూడా ఇక్కడ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వీరి వెంట కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

సైతారుపేటలో ఘనంగా తీర్థం



సైతారుపేటలో తీర్థానికి విచ్చేసిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: సంక్రాంతి సందడి ప్రధానంగా పల్లెల్లోనే కనిపిస్తుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సైతారుపేట గ్రామంలో మంగళవారం తీర్థమహోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. పరిసర ప్రాంతాలనుంచి తీర్థానికి వచ్చిన ప్రజలను పలకరించారు. కార్యక్రమంలో సైతారుపేట ఎంపీటీసీ శానాపతి రాము, ఎస్.రాయవరం కోఆపరేటీవ్‌బ్యాంక్ చైర్‌పర్సన్ అల్లాడ నాగరాజు పాల్గొన్నారు.